

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కోటి సంతకాల కరపత్రాలను

### మాజీ మంత్రికి అందజేసిన దామిశెట్టి



**కావలి, నవంబర్ 14,ప్రభాతవార్త :** వైస్సార్సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సూచనలతో కావలి పట్టణ 37వ వార్డ నందు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర మేధావులు ఫోరం ప్రధాకార్యదర్శి దామిశెట్టి సుధీర్ నాయుడు ఆధ్వర్యంలో వార్డులో కోటిసంతకాల సేకరణ పూర్తి చేసి వాటికి సంబంధించిన కరపత్రాలను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి సమక్షంలో కావలి వైసిపి కార్యాలయం నందు శుక్రవారం మాజీ మంత్రి అదిములపు సురేష్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేకర్ రెడ్డి లకు అందచేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, నియోజక మహిళా అధ్యక్షురాలు నందనవనం సీతమ్మ,పట్టణ కార్యదర్శి ఆవుల సురేష్ రెడ్డి,వార్డ్ వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## కండలేరులో 58.240 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, నవంబరు 14, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయం నాటికి 58.240 టీయంసీల నీటి మట్టం నమోదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జలాశయంలోకి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జలాశయం హెడ్ రెగ్యులేటర్ ద్వారా 710 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుండి 50 క్యూసెక్కులు,లోలేవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కులు,ల చోప్పున మొత్తం 800 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## వి.ఆర్.ఓ, ప్లానింగ్ కార్యదర్శిలకు నక్షపై సమీక్ష కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 14,ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం వార్డు సచివాలయ వి.ఆర్.ఓ లు, పట్టణ ప్రణాళిక విభాగం నక్ష ప్రాజెక్ట్ బృందంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు . ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష ప్రాజెక్టు నిర్వహణకు సంబంధిత వార్డు సచివాలయ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు అందరూ సహకరించాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ భూములు, ప్రభుత్వ భవనాలు, దేవస్థానాలు, ప్రధాన మార్గాలు, మేజర్ కాలువలు అన్నింటిని నక్ష ప్రాజెక్టు ద్వారా మ్యాపింగ్ చేయించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, నక్ష నోడల్ ఆఫీసర్ సతీష్ కుమార్, వార్డు సచివాలయ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు, వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఎస్ఈఐఎల్ కంపెనీ సహకారంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం

- గిరిజనులతో కలిసి 31 ఇళ్లలో గృహప్రవేశాలు చేయించిన సోమిరెడ్డి
- సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనుల అభివృద్ధికి కృషి





**ముత్తుకూరు, నవంబర్ 14, ప్రభాతవార్త** ఎస్ఈఐఎల్ కంపెనీ సహకారంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మదేవం పంచాయితీలో 50 పడకల ఆసుప్రతి నిర్మాణాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ముత్తుకూరు మండలంలో రూ. 20కోట్లు వెచ్చింది అత్యాధునిక వసతులతో 50 పడకల ఆసుపత్రి నిర్మించాలని ఎస్ఈఐఎల్ కంపెనీని కోరామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని, 50 పడకల ఆసుపత్రిలో వైద్య పరీక్షలతో సహా అన్ని సేవలు ఉచితంగా అందిస్తామని ఎస్ఈఐఎల్ కంపెనీ సిఈఓ మహాపాత్ర తెలిపారని అన్నారు. నిర్సంగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేయబోతున్నారని తెలియజేసేందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మేజర్ పంచాయితీలైన ముత్తుకూరు, కృష్ణపట్నంను అదానీ కృష్ణపట్నం పోర్టు కంపెనీ దత్తత తీసుకుని రూ. 11 కోట్లతో అభివృద్ధి పనులు చేయబోతున్నా రు. 10 పామాయిల్ కంపెనీలు 10 గిరిజన కాలనీలను దత్తత తీసుకుని అవసరమైన పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బ్రహ్మదేవం కట్టమీద గిరిజన కాలనీని జెమినీ కంపెనీ దత్తత తీసుకుని రూ. 93 లక్షలతో పనులు చేపట్టిందన్నారు. మల్లికార్జున పురంలో 280 గిరిజన కుటుంబాలను ఎస్ఈఐఎల్ కంపెనీ దత్తత తీసుకుందని, ఇప్పటికే 2 కోట్ల అంచనాలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. గిరిజనులు, దళితులు, బిసిలు, నిరుపేదల ఇళ్ల క్వాలిటీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. పిడతాపోలూరులో 62 ఇళ్లకు గాను 31 పూర్తయ్యాయన్నారు. ఆ ఇళ్లకు కూడా గృహ ప్రవేశాలు చేసామన్నారు. గిరిజనులతో గృహ ప్రవేశాలు చేయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు సిఎం అయ్యాక గిరిజనుల ఇంటికి ఇచేనచ మొత్తాన్ని రూ. 75 వేలు పెంచి రూ. 2.55 లక్షలు చేసారన్నారు. రూ. 2.55 లక్షల్లో రూ. 1.80 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, రూ. 75 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం 31 ఇళ్లకు రూ. 55.80 లక్షలు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఆ మొత్తాన్ని రూ. 79.05 లక్షలకు పెంచారన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో మంత్రి, ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి సిఎస్ఆర్ నిధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసారన్నారు. ఎస్ఈఐఎల్, జెమినీ వంటి కంపెనీలు సిఎస్ఆర్ నిధులతో సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చి నిదులు ఖర్చు పెడుతున్నారని వారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, మునికూరు రవికుమార్ రెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, స్థానిక నాయకులు దండు శ్రీనివాసులు, సురేష్ రెడ్డి, డిజిటల్ విభాగం ఐటిడిపి అధ్యక్షులు తిరుమలశెట్టి సతీష్ నాయుడు, కృష్ణాపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వివిధ గ్రామాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు

### - డాక్టర్ ఎస్కే ఖాదర్ వలీ



**నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త -వైద్యం** జిల్లాలో టీబీ నివారణకు వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి ఎస్కే ఖాదర్ వలీ పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరులోని బీవీ నగర్‌లో ఉన్న డ్యామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్టులో ఆయన టీబీ నివారణ సిబ్బందితో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నివారణ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నిర్లక్ష్యాన్ని సహించబోనని హెచ్చరించారు. టీబీ రహిత జిల్లాగా నెల్లూరు జిల్లాను నిలిపేందుకు వైద్యులు, సిబ్బంది మరింత మెరుగైన సేవలందించేందుకు ప్రయత్నాలు సాగించాలన్నారు. క్షేత్ర స్థాయిలో రోగులకు అందుతున్న సేవలు, ఇంటెన్సీ ఫైడ్ టీబీ క్యాంపెయిన్ గురించి సిబ్బందితో యూనిట్ వారీగా సమీక్షించారు. మెరుగైన సేవలే లక్ష్య సాధన కావాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు జిల్లాలోని టీబీ నివారణ సూపర్‌వైజర్లు, ల్యాబ్ సూపర్‌వైజర్లు, టీబీహెచ్‌వీలు, భవ్య సిబ్బంది, డ్యామ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోమిరెడ్డి సూచనలతో దళితుల ఇల్లు కూల్చివేత

### - దక్కలివారిపాలెంలో కాకాణి ఆగ్రహం



**తోటపల్లి గూడూరు, నవంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని దక్కలివారిపాళెం గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన ఇంటిని అధికారులు అక్రమంగా కూల్చివేయడంపై మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం గ్రామాన్ని సందర్శించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మీదూరు శీనయ్య కుటుంబం ఎంతో కష్టపడి కట్టుకున్న ఇల్లు కొద్ది నిమిషాల్లో ధ్వంసం కావడం అమానుషమని వ్యాఖ్యానించారు.సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనలతోనే అధికారులు ఈ చర్యలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.గ్రామ కంఠ భూములను గ్రామస్తులు అనుభవిస్తున్నట్లయితే యాజమాన్య హక్కులు కల్పించవచ్చని 2015 లోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. అటువంటి స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శి రికార్డులను తారుమారు చేస్తూ, ఎలాంటి విచారణ లేకుండా ఇంటిని కూల్చివేయడం దారుణమన్నారు. సర్వేపల్లిలో అభివృద్ధి కంటే అరాచకాలు, అక్రమాలు, ఇళ్ల కూల్చివేతలే ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమిరెడ్డి ఒక వైపు దళితులకు, గిరిజనులకు మేలు చేస్తున్నామని చెప్పుకుంటూ మరోవైపు వారి ఇళ్లు కూల్చడం, ప్రశ్నిస్తే గొంతులు కోయించడం వంటి వ్యవహారాలు విచారకరమని తెలిపారు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా నుండి ఆలయ భూముల అమ్మకాల వరకు ఎన్నో అవినీతి వ్యవహారాల్లో సోమిరెడ్డి ప్రమేయం ఉన్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ జెన్కో సంస్థ బంకర్ల వద్ద దారి దోపిడీ జరుగుతున్నా అధికారులపై ఒత్తిడి వల్ల ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు.ఇల్లు కోల్పోయిన దళిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని కాకాణి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరగకపోతే జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తిరిగి విచారణ జరిపించి బాధితులకు కొత్త ఇళ్లు మంజూరు చేసి నిర్మిస్తామని తెలిపారు. అధికారులకు కూడా హెచ్చరికలు జారీ చేస్తూ, నేడు చేసిన అన్యాయాలు రేపు వారి పాలిట శాపంగా మారుతాయని పేర్కొన్నారు.సర్వేపల్లి ప్రజలు నా కుటుంబ సభ్యుల్లాంటి వారు. ఎవరి ఇంటి మీద అన్యాయం జరిగినా, వారి సరసన నిలబడి పోరాడటం నా బాధ్యత," అని కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు,స్థానిక కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 16 నుంచి ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మరమ్మతు పనులు ప్రారంభం కమిషనర్ వెల్లడి



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 14,ప్రభాతవార్త:** ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మరమ్మతు పనులు, ఫ్లైఓవర్ పైన జాయింట్ల వద్ద రిపేర్లు తదితర నిర్మాణ పనులను 16వ తేదీ నుంచి చేపట్టి సుమారుగా 45 రోజులలో పూర్తి చేయనున్నామని కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ.నందన్ తెలిపారు. నెల్లూరు ట్రాఫిక్ విభాగం సిఐ రామకృష్ణతో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, ఆర్ అండ్ బి విభాగం, నేషనల్ హైవే అథారిటీలు సంయుక్తంగా సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదేశాలు మేరకు ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, ఫ్లై ఓవర్ పైన 40 లక్షల రూపాయలతో నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారని కమిషనర్ తెలిపారు.నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ పైన ఆదివారం అర్ధరాత్రి నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించామని వారు స్పష్టం చేశారు. వాహనాల ప్రయాణ మార్గాలను ప్రత్యామ్నాయ దిశలలో మళ్ళించి వాహన చోదకులకు అసౌకర్యం కలగకుండా మార్గాలను నిర్దేశించామని కమిషనర్ వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు నుంచి వచ్చే వాహన చోదకులు నూతన పెన్నా వారధి పైనుంచి లేదా సెట్టిగుంట రోడ్డు రైల్వే లైన్ ప్రాంతం నుంచి నగరంలోకి ప్రయాణించాలని, నవాబుపేట, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు విజయమహల్ గేటు లేదా రామలింగాపురం అండర్ బ్రిడ్జి మార్గాన్ని నగరంలోకి ఎంచుకోవాలని కమిషనర్, ట్రాఫిక్ సి.ఐ లు స్పష్టం చేశారు.కావున నెల్లూరు నగర ప్రజలంతా జరగనున్న అభివృద్ధి పనులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా కార్తీక శుక్రవారం పూజలు



**కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షిసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీక మాస పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించుకుని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తుల సహకారంతో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మురళి స్వామి, వంశీస్వామి, సాయి స్వామి, శేఖర్‌స్వామి, శ్రీనివాసులు స్వామి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కందుకూరులో ఫుడ్ కమీషన్ సభ్యులు పర్యటన

### పలు పాఠశాలల మధ్యాహ్నబోజనం పరిశీలన





**కందుకూరు నవంబరు 14 ప్రభాతవార్త** ప్రభుత్వం వివిధ శాఖలద్వారా సరపరా చేస్తున్న పౌష్టికాహారంను నిబంధనలమేరకు లబ్దిదారులకు అందించాలని రాష్ట్రఫుడ్ కమీషన్ సభ్యులు బి.కాంతారావు నిర్వహకులుకు సూచించారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే జాతీయభద్రతాచట్టం-30 కింద శిక్షార్హులన్నారు శుకృవారం ఆయన కందుకూరు నియోజకవర్గంలో అధికారికంగా పర్యటించారు. గుడ్లూరులోని అంగన్‌వాడీ కేంద్రం,పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి సరపరా అయ్యే కోడిగ్రుడ్ల నాణ్యతాప్రమాణాలు పరిశీలించారు.నాణ్యతాప్రమాణాలను ఆక్షేపించారు. బరువు తగ్గినట్లు తెలిపారు.అనంతరం కందుకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో జరిగే మధ్యాహ్నబోజన పథకం తీరుతెన్నులను పరిశీలించారు.ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ద్వారకారాణి, నరసింహామూర్తిలు మధ్యాహ్నబోజన పథకం తీరుతెన్నులను ఆయనకు వివరించారు.పభుత్వ రేషన్ దుకాణాలు,మధ్యాహ్నబోజనపథకం, అంగన్‌వాడీ సేవలు,ప్రసూతిప్రయోజనాలు తదితర పథకాలు ఆహారభద్రతా చట్టం పరిధిలో ఉంటాయన్నారు.వీటి నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చట్టపర చర్యలు ఉంటాయని కాంతారావు అధికారులుకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్ధులనుద్దేశించి మాట్లాడారు. భోజనపథకంలో ఎటువంటి లోపాలును సహించవద్దన్నారు.లోపాలు, నిర్లక్ష్యంపై 9966242414 నంబరులో తనకు పిర్యాదచేయాలని సూచించారు. నాణ్యమైన విద్యను పొందాలంటే పౌష్టికాహారం ఉండాలన్నారు.ఇందుకోసం కేంద్రరాష్ట్రప్రభుత్వాలు సన్నబియ్యంతోపాటు పోషకాహారంతోకూడిన మెనూ అమలు చేస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్‌వో లీలారాణి, సివిల్‌సప్లయ్‌కార్పోరేషన్ డీఎం అర్జునరావు,ఆహార భద్రతా అదికారి ప్రణతి,ఎంఈవో సుబ్బారెడ్డి ఎంఈవో-1శర్మ,సీఐటీయూ నేతలు జీవిబీ కుమార్,ఎస్ చెన్నకేశవులు ఉపాధ్యాయ సంఘనేతలు పెరుగు ప్రసాద్,చిత్తూరి వెంకటేశ్వర్లుతోపాటు పలువురు అదికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కావలి ప్రాంతానికి విద్య మణిహారాలు ఆర్ఎస్ఆర్ విద్యా సంస్థలు

### - మాజీ విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్





**కావలి, నవంబర్ 14, ప్రభాతవార్త :** నాణ్యతతో కూడిన విద్యను అందిస్తూ తక్కువ ఫీజులతో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్న ఆర్ఎస్ఆర్ విద్యాసంస్థలు కావలి పరిసర ప్రాంతాలకు విద్య మణిహారాలని మాజీ విద్యాశాఖ మంత్రి, మాజీ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ బాబు తెలియజేశారు.కావలి సమీపంలోని ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల బాధ్యులు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తో కలసి పాఠశాలలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ బాబు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు పాల్గొని ప్రారంభించడం జరిగింది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి అభినందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడారు వైజ్ఞానిక ప్రదర్శనలను ఒక అద్భుతమైన ప్రతిభతో ఆర్ఎస్ఆర్ విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమని తెలియజేశారు.ఎంతో సృజనాత్మకతతో అనేక సైన్స్ ప్రదర్శనలు విద్యార్థులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.పాఠశాల స్థాపించిన 13 సంవత్సరాల లోనే అంచెలంచెలుగా ఎదిగి ఉన్నతస్థాయికి చేరడం ఆనందంగా ఉందన్నారు.దీనికి కారణం పాఠశాల మేనేజ్మెంట్ సహకారం సిబ్బంది కృషి పట్టుదల అన్నారు.మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఈ ప్రాంతానికి చెందినవారై నందున ఈ ప్రాంతానికి ఏదో ఒకటి చేయాలని అన్ని దానాల కన్నా గొప్పదనం విద్యా దానం అయినందున ఈ ప్రాంతంలో పేదవారికి కార్పొరేట్ విద్యను అందించాలని తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందించడం పేదలకు ఒక వరం అన్నారు.విద్య యొక్కనాణ్యతతో రాజీ పడకుండా క్వాలిటీ విద్యను అందించడం జరుగుతుందన్నారు.అన్ని విభాగాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఒక ఉత్సవములాగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగనన్న పాలనలో విద్య,వైద్యంకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముందుకువెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు కావలి ప్రాంతానికి తన వంతు సహకారం అందించాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఈ ప్రాంతంలో పేదవారికి అందుబాటులో కార్పొరేట్ విద్యను అందిస్తూ ఆయనకు ఈ ప్రాంతంపై ఎంత మక్కువ ఉందనేది అర్థమవుతుందన్నారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఇంతటి స్థాయిలో నిర్వహించాలంటే ఎంతో పట్టుదల, కృషి ఉండాలన్నారు.ఉన్నతమైన విద్యా ప్రమాణాలతో నిర్వహిస్తున్న ఆర్.ఎస్.ఆర్ పాఠశాల భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతలు గడించాలని కోరారు.మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడారు వైజ్ఞానిక ప్రదర్శనలు ఇంత ఘనంగా నిర్వహించేందుకు కృషిచేసిన పాఠశాల ప్రిన్సిపల్,సిబ్బందికి, విద్యార్థులకు, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చంద్రజ్యోతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**చేజర్ల నవంబర్ 14 ప్రభాతవార్త** చేజర్ల మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో పండిట్ జవహరల్ లాల్ నెహ్రు జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బిల్లుపాడు పాఠశాల, ఆదూరుపల్లి గురుకుల బాలికల పాఠశాల ఏటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,కే ఎన్ పల్లి పాఠశాల, చేజర్ల మెయిన్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రుచిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతు జవహరల్‌లాల్ నెహ్రుకి పిల్లలు అంటే ఎంతో ఆప్యాయతంగా ఉండేవారన్నారు. భారతదేశానికి జవహర్‌లాల్ నెహ్రు చేసినటువంటి సేవలను కొనియాడుతు విద్యార్థులకు నెహ్రు గురించి తెలియజేయడం జరిగింది. విద్యార్థులందరికి చాక్లెట్లు పంచిపెట్టారు. విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. కాగా చేజర్ల మెయిన్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్బంగా మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ప్రదానోపాధ్యాయులు సిబ్బంది ఎంఆర్సి స్టాఫ్,భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -2 మస్తానయ్య, ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**కలువాయి నవంబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని అన్ని పాఠశాలల నందు శుక్రవారం బాలల దినోత్స వాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఇందులో భాగంగా మండలంలోని తెలుగురా యపురం ఎంపిపిఎస్ పాఠశాల నందు ప్రధానోపాధ్యా యులు జి.వి మురళీకృష్ణా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వ హించారు. అదే విధంగా డాన్‌బోస్కో హైస్కూల్ నందు బాలల దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి నిర్వాహకులు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. అదే విధంగా 58 వ జాతీయ గ్రంధాలయ వార్షికోత్సవం సందర్భంగా లైబ్రరియన్ సుధాకర్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను కుల్లూరు, కలువాయి పాఠశాలల తోపాటు శివసాయి జూనియర్ కళాశాల నందు వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల చేత నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రూఫ్‌షెడ్ ఏర్పాటు





**వింజమూరు, నవంబర్ 14, ప్రభాతవార్త** వింజమూరు మండలం గుండెమడగల గ్రామంలో నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల పూర్వ విద్యార్థి ప్రముఖ బిల్డర్ గాలి రఘురాం నాయుడు రాజ్యలక్ష్మీ దంపతుల కుమార్తె విద్యా ప్రవల్లిక ఆమె తనయ షాన్విత దాతలుగా ఈ రూఫ్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూఫ్ షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనకారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి ఎంఈఓ-2 మధుసూదన్‌రెడ్డి దాత రఘురాం నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు ఇతర అతిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధా నోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామంలోని పూర్వ విద్యార్థులు ప్రముఖులు ఎంతో మంది ఎన్నో విధాలుగా పాఠశాల అభివృద్ధికి దోహదపడుతూ వచ్చారన్నారు. అలాగే తమ పాఠశాలలోని విద్యార్థులు ప్రతి సంవత్సరం జిల్లా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతిలో గుర్తింపు తెచ్చుకుంటూ చదువుల్లో ముందుకు సాగుతున్నారన్నారు. పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తమ పాఠశాల ఉపా ధ్యాయురాలు గాలి రఘురామనాయుడును రూఫ్ షెడ్ ఏర్పాటు చేయాలని కోరగాఎంతో పెద్ద మనసుతో రఘురాం నాయుడు తన మనువరాలు షాన్విత పేరుతో ఈ రూఫ్ షెడ్ ఏర్పాటు చేయడం ఎంతో అభినంద నీయమని అన్నారు. దాత రఘురామానాయుడు మాట్లాడుతూ పాఠశాలలోని సమావేశాలు తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించుకునేందుకు అంతే కాకుండా పాఠశాల వార్షికోత్సవాలు సాంస్కృతి కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతే కాకుండా పిల్లలకు పోటీ పరీక్షలు నిర్వ హించుకునేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. అంతే కాకుండా వర్షం లేదా ఇతర ప్రతికూల పరిస్థి తుల్లో కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. తాను ఉన్న ఊరికి ఏదో చేయాలని సంక ల్పంతో ఎలాంటి కార్యక్రమాలను ప్రారంభించాను అన్నారు. అక్కడ రాని ఆనందంలో చిన్నపాటి కార్యక్రమం ద్వా రానే నాకు కలిగిందన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు చెరుకూరు వెంకటేశ్వర నాయుడు ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఆయన బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలి నరసప్ప నాయుడు, గాలి రామ్మోహన్‌నాయుడు, అంక నపల్లి శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ చీదర్ల పుల్లయ్య, మాజీ సర్పంచ్ బోరాల శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ నాగేష్, పాలసాని నరసింహారెడ్డి, గాలి జయరాం నాయుడు, చెరుకూరు వెంకయ్య నాయుడు, పోస్టు కొండయ్య, కుంకు ప్రభాకర్, కుంకు కొండప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రఘురామ నాయుడు దాతృత్వం చిన్నారులకు వరం



**వింజమూరు, నవంబర్ 14, ప్రభాతవార్త** కన్న ఊరు జన్మభూమికి రుణం తీసుకోవాలన్న కోరిక ఏ కొద్దిమందికో కలుగుతుంది. వారిలో గుండెమడకల గ్రామానికి చెందిన గాలి రఘురామ నాయుడు ఒకరు. తన మనుమరాలు షాన్వితపై ఉన్న అపారమైన ప్రేమ చిన్నారులపై ఉన్న ఆదరణ కలగలసి అంగన్‌వాడీ చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని కలిగేందుకు అదే విధంగా వారికి విద్యపై ఆసక్తి కలిగే విధంగా అవసరమైన సౌకర్యాలను కలిగించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఎక్కడా లేని విధంగా తన మనవరాలు పూరుతో సాన్విత శిశు క్రీడా వనాన్ని ఏర్పాటు చేసి అందుకుఅవసరమైన జారుడుబల్ల, ఉయ్యాలలు, స్ప్రింగ్‌సెట్లు, స్ప్రింగ్ రైడర్స్, స్పిన్నర్లు ఏర్పాటు చేయడం జరిగింది.వీటితో ఈ చిన్నారులు కేవలం చదువే కాకుండా మా నసిక ఉల్లాసానికి పనికి వచ్చే క్రీడలు కూడా ఆడుకునేందుకు తగిన అవకావం ఉంటుందని ఆ ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు దాత రఘురాం నాయుడు ఉదారత్వాన్ని చాటుకున్నాడు. ఎంతో మంచి మనసున్న వ్యక్తిగా విద్యార్థుల యొక్క ఔన్నత్యానికి చిహ్నంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనం దదాయకమని సీడీపీవో పద్మజాకుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాలి నరసప్ప నాయుడు, గాలి రామ్మోహన్ నాయుడు, శివశంకర్ రెడ్డి, బోరాల శ్రీనివాస్ యాదవ్, చీమల వెంకట రత్నాకర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర్ నాయుడు, అడిషనల్ సీడీపీవో షర్మిష్టా సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్త రాధా, ప్రకృతి శ్రీదేవి,ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం పట్ల అవగాహన




**కలువాయి నవంబర్ 14 ప్రభాతవార్త** ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలువా యి ,కుల్లూరు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నందు వైద్యులు డాక్టర్ విజయలక్ష్మీ ,డాక్టర్ రమ్య,కుల్లూరు వైద్యులు డాక్టర్ శ్రీదర్,డాక్టర్ ఎస్‌కె అన్వర్ల ఆధ్వర్యంలో ప్రజలకు అదే విధంగా పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని తెలియజేసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతు ప్రస్తుతం చిన్నపిల్లలకు ఎక్కు వగా మధుమేహానాకి గురౌతున్నారని. ప్రధానంగా టైప్-1 డయాబిస్ బాధితులు ఇన్‌సిలిన్ తప్పనిసరిగా జీవి తాంతం వాడాల్సి ఉంటుందని షుగర్ వచ్చినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదనన్నా రు.నియంత్రణలో వ్యాధిని ఉంచుకోవాలని అందుకు తగిన విధంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని డాక్టర్లు సూచనలు పాటిస్తు వ్యాయం చేయాలని సమతుల్య అహారం తీసుకోవాలని తెలియజేశారు. ప్రధానంగా మానసిక ఆందోళనకు గురి కాకుండా ఉండడం వలన పలువ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఈసందర్భంగా ఆయనతెలియజేశారు. వైద్యసిబ్బంది పాల్గోన్నారు.

## సహకార వారోత్సవాలకు పేడూరులో శుభారంభం



**తోటపల్లి గూడూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** మండలంలోనిపేడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా గురువారం కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సం దర్భంగా పేడూరు సహకార సంఘం అధ్యక్షులు గూడూరు నారాయణ సహకార జెండాను ఎగుర వేసి వారోత్సవాలకు శుభారంభం చేశారు. సంఘం కార్యనిర్వాహక అధికారి పి.వి. రమణమూర్తి సభ్యు లందరితో సహకార ప్రతిజ్ఞ చేయించి, సహకార వ్యవస్థ ప్రాధాన్యాన్ని వివరించారు.మండల వ్యవసాయ అధికారిణి శిరీష రాణి, కృషి రంగ నిపుణులు మురళీధర్ రెడ్డి రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ సూచనలు ఇచ్చారు. సంఘ సభ్యులు మేనాటి శీనయ్య, దేవరాల ప్రవీణ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ విశిష్టతను తెలుసుకోవాలి : ఎస్సైనరేష్



**విడవలూరు,నవంబర్ 14 ప్రభాతవార్త:** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం స్థానిక ఎస్సై పి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను లైబ్రరీ విశిష్టతను విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి మంచి చదువు చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని,పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలి తద్వారా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు.లైబ్రేరియన్ నిరూప, అక్షరస్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రెయిన్‌బో స్కూల్‌లో చిల్డ్రన్స్‌డే సంబరాలు




**బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో స్కూల్‌లో చిల్డ్రన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.డైరక్టర్ టి .చిట్టిబాబు నేతృత్వంలో ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్బంగా డైరక్టర్ చిట్టిబాబు మాట్లాడుతు బాలల దినోత్సవం అంటే పిల్లలు ఎంతో ఆనందంతో ఆటలాడుకుంటారని అన్నారు. పిల్లలు చిన్నతనం నుండి కేవలం చదువుకే కాకుండా క్రీడాలకు కూడా ప్రాధన్యత ఇవ్వాలని తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించ వచ్చునని చదువులో కూడా బాగా రాణిస్తారని చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు ప్రధానం చేశారు. స్కూల్ యాజమాన్యం,స్టాఫ్ సొంతంగా విద్యార్థులకు విందు బోజనం ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో అడ్వైజర్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## బుచ్చిలో బిజెపి నేతల విజయోత్సవ సంబరాలు



**బుచ్చి నవంబర్ 14ప్రభాతవార్త** బీహార్‌లో ఎన్‌డిఏ కూటమి విజయం సాధించిన సందర్బంగా బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయితీలో అర్బన్ బిజెపి పార్టీ అద్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం సబ్ రిజిష్టర్ ఆఫీస్ సెంటర్ వద్ద టపాసులు కాల్చి,స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిజపి జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి మోహన్‌బాబు,సీనియర్ నాయకులు మాచవరం శ్రీనివాసులు, ఓబిజి మోర్చ జిల్లా కార్యదర్శి సోమ లక్ష్మయ్య,ఎస్‌సి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గోళ్ళ నరసింహులు,కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిమలూరు ప్రవీణ, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు పార్లపల్లి మహేష్‌నాయుడు, బిజెపి అర్బన్ ఉపాద్యక్షులు సందలనాగేశ్వరరావు, బిజెపి అర్బన్ కార్యదర్శి గాదంశెట్టి సురేష్ కార్యకర్తలు పాల్గోన్నారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం



నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త - వైద్యం నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఎంఎస్‌ఆర్ స్పాస్టిక్స్ సెంటర్ లో శుక్రవారం మన భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొని పిల్లలకు చిల్డ్రన్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. దేశ తొలి ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ, అనేక సేవలు చేశారని అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పిల్లల పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతను చూపించేవారని, అందుకే పిల్లలంతా ఆయన్ను చా చా నెహ్రూ అని పిలిచేవారాని, బాలలకు ప్రేమను, విలువలతో కూడిన అలవాట్లను, సంరక్షణను, నాణ్య మైన విద్యను ఇవ్వడమే ఈ బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని, నేటి బాలలే రేపటి పౌరులని తెలియజేస్తూ , ఈనాటి బాలలను మంచి విద్యార్థులుగా తీర్చిదిద్ది సమాజాభివృద్ధికి తోడ్పడలాని తెలియజేశారు. ఈ బాలల దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలలో పాల్గొన్న స్పాస్టిక్స్ సెంటర్ చిన్నారులకు బహుమతులని, పండ్లను స్మైల్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్.కె. పర్వీన్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపాల్ ఉదయ్ భాస్కర్ , చిన్నారులు వారి తల్లిదండ్రులు , రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## ఏజిపి గ్యాస్ పైప్ లైన్ లపై తవ్వకాలు నిషేధం




**నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు నగరం లో గ్యాస్ పైప్ లైన్స్ ఆటోనగర్ ఇండస్ట్రి యల్ నుండి ఎం.జి.బి మాల్ వరకు వేసి ఉన్నా యి .తదితర ప్రాంతాల్లో గ్యాస్ పైప్ లైన్లు ఉన్నాయని దీనిపై అవగాహన లేని వ్యక్తులు గ్యాస్ పైప్ లైన్ పై తవ్వకాలు చేపడుతున్నారు. దాని వల్ల గ్యాస్ లీక్ అయ్యి ఆస్తి నష్టం తో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశము చాలా ఉంది. కావున పత్రికా ముఖంగా, ప్రజలందరికి తెలియజేయడమేమనగా,గ్యాస్ పైపులైన్లపై జెసిబిలతో, డిగ్గర్లతో, ఇతర యంత్రాలతో తవ్వకాలు చేపట్టే ముందు ఏజిపి యాజమాన్యానికి ముందుగా సమాచారం తెలియజేయాలని పలుమార్లుహెచ్చరిస్తున్నప్పటికీఇటీవల ఏపీఐ ఐ సి ఆటోనగర్ ప్రాంతంలో డ్రెయినేజ్ మరమ్మతులు చేస్తూ ఎటువంటి ముందస్తు సమాచారం తెలియజేయకుండా గ్యాస్ పైప్ లైన్ పైతవ్వకాలు జరిపి ఆస్తినష్టం కలిగించిన విషయం పై ఏజిపి గ్యాస్ కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవడం జరిగింది. దయచేసి గ్యాస్ పైపులైన్ల కు దగ్గరగా తవ్వకాలు, మర్మతులు చేపట్ట దలచినవారు ఏజిపి యాజ మాన్యం టోల్ ఫ్రీ నెంబర్ 1800 2022 999, 7200108123 కు ముందుగా సమాచారం అందించిప్రమాదాల నియంత్రనకు అందరు సహకరించాలని కోరుతున్నాము.

## టిడిపి మండల కన్వీనర్ చెన్ను అశోక్ రెడ్డికి బిజెపి నేతల అభినందన



**రాపూరు,నవంబరు14ప్రభాతవార్త** రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షునిగా భాధ్యతలు స్వీకరించిన స్వర్గియ రాపూరు మండల ప్రజాపరిషత్ ఆధ్యక్షుడు చెన్ను బాలకృష్ణా రెడ్డి తనయుడు చెన్ను అశోక్ రెడ్డిని రాపూరు మండల బారతీయ జనతా పార్టీ మండల పార్టీ ఆధ్యక్షుడు దూడల పెంచలయ్య నేతృత్వంలో కలసిన బిజెపి నేతలు ఆయనకు శాలువా కప్పి అభినందించారు. స్వర్గియ రాపూరు మండల ప్రజా పరిషత్ ఆధ్యక్షులు చెన్ను బాలకృష్ణా రెడ్డి జీవించి వున్నంత కాలం మండలంలో తిరుగులేని నాయకునిగా పేరుపొంది, మండలంలో తనకంటూ ఒక గుర్తింపుని సాధించారని, ఆయన రాజకీయలను అందిపుచ్చుకోని ఆయన కుమారునిగా మండలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చెపట్టి తద్వారా తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారు కోరారు. రానున్న స్ధానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అన్ని స్ధానాలలో విజయం సాదించేలా కూటమి పార్టీలైన బిజేపి,జనసేనలను కలుపుకోని ముందుకు సాగాలని కోరారు. మండలంలో అవసరమైన అభివృద్ధి పనులను వెంకటగిరి ఎమ్మేల్యే కురుగోండ్ల రామకృష్ణ సహకారంతో పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు చెన్ను అశోక్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సామర్ల జయసింహ, గోపీ, ఆదిరెడ్డి తదితరులున్నారు.

## కండలేరు జడ్.పి.హెచ్.ఎస్‌లో రక్తదాన శిబిరం



**కండలేరుడ్యాం(రావూరు), నవంబరు14ప్రభాతవార్త** మండలంలోని కండలేరుడ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వారి సహకారంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 24 మంది రక్తదానం చేశారు. ఈ సందర్బంగా కొండూరు సుబ్బారావు మాట్లాడుతూ బావి భారత నిర్మాతలైన బాలలు ఉన్నత అశయాలు కలిగి, సేవా ధృక్పదంతో మెలగాలని కోరారు. బ్లడ్ బ్యాంకు మోటివేటర్ యం. మధు బృంధం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ నిర్వహించి,రక్తదానం పట్ల అవగాహన కల్పించారు. రక్తదానం చేసిన దాతలకు మేఘన ఆటోమోబైల్స్ అధినేత గడ్డం రత్నయ్య జ్ఞాపికలను ఆందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.యానాది రెడ్డి, ఎ.సత్యనారాయణ, తులసిరాం సింగ్, ఇ.వెంకటేశ్వర్లు, స్ధానికులు బక్కా క్రిష్ణ, కె. శివ శంకర్, కోటి, గోపి తదితరులున్నారు.

## గ్రంధాలయంలో జవహర్‌లాల్ జయంతి వేడుకలు



**రాపూరు,నవంబరు14ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ గ్రంధాలయంలో 58వ జాతియ గ్రంధాలయ వారోత్సవాలలో బాగంగా మాజీ ప్రధాని స్వర్గియ జవహర్ లాల్ నెహ్రు జయంతి వేడుకలను ఘ నంగా నిర్వహించారు. ఇందులో బాగంగా నెహ్రు చిత్రపటానికి పూల మాల వేసి నివాళుల ర్పించారు.ఈ సంద ర్భంగా గ్రంధాలయ అధికారి అంజయ్య మాట్లాడుతూ నెహ్రు జయంతిని బాలల దినోత్స వంగా నిర్వహిం చుకుంటారని తెలిపారు. శుక్రవారం నుండి 20వ తేది వరకు గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించడం జరగుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెసి సుబ్రమణ్యం ఆధ్వరంలో ఈ కార్యక్రమాలను గ్రంధాలయాధికారి నిర్వహించారు.పలువురు పాఠకులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## ఆర్టీసిలో సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికుల నిరసన



రాపూరు,నవంబరు14ప్రభాతవార్త మండల కేంద్రమైన రాపూరు ఆర్టీసి డిపోలో శనివారం స్టాఫ్ వర్కర్స్ పెడరేషన్ కమిటీ కార్మికులు సమస్యలు తీర్చాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరు డిపో కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లడుతూ స్త్రీ శక్తి పధకంలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని, పెంచిన పనిగంటల ఉత్తర్వులు రద్దు చేయాలని, మహిళలకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని తద్వారా సున్నా పేర్ టిక్కెట్లు అమలు చేయాలని,కార్మికులపై దాడి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసి సంస్ధే నిర్వహించాలని, డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సి న బకాయిలు వెంటనే చెల్లించాలని, కోరారు. దీంతో మరిన్ని డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రాన్ని అధికారులకు ఆందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్టీసి కార్మికులు వున్నారు.

## అంకమ్మతల్లి ఆలయ విరాళం రూ.25,116లు



**కందుకూరు నవంబరు 14 ప్రభాతవార్త** కందుకూరు గ్రామ దేవత శీఅంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ అనివేటి మండప నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం గుర్రం వెంకటేశ్వర్లు ధర్మ పత్ని పద్మజ, కుమారుడు వేణుగోపాల్ కోడలు సత్యవతి, వారి కుటుంబం తరపున రూ.25,116లు విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు శుకృవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెలికాం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శేషు స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు



**నెల్లూరు రూరల్, నవంబర్ 14, ప్రభాతవార్త** బుజ బుజ నెల్లూరులోని శేషు స్కూల్లో బాలల దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శేషు సార్, ఉపాధ్యాయ బృంధం జ్యోతి ప్రజ్వలన చేసి జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శేషు సార్ మాట్లాడుతూ పిల్లలు ఓర్పు, నేర్పుతో తమ లక్ష్యాలను సాధించాలని నెహ్రు ని తమ జీవితాలకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తరువాత నిర్వహించిన లుసిడ హ్యాండ్ రైటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, పుస్తకాలు బహుకరించారు. శశికళా ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. జశ్వంత్, టిప్పు, షాహుల్, అవినాష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి వేగవంతం



**నెల్లూరు రూరల్, నవంబర్ 14, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్, హనుమాన్ జంక్షన్ వద్ద గెజిటెట్ లేఅవుట్‌లో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిదర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 20వ డివిజన్ అభివృద్ధి కోసం రూ.5 కోట్ల 70 లక్షల నిధులను కేటాయించామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పరుగులు తీస్తోందని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలు ఇలా కొనసాగాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయ లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నందిమండలం భాను శ్రీ, క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, కో క్లస్టర్ ఇన్‌చార్జి ఖాదర్ భాష, 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు, 20వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చారా మల్లిఖార్జున్, టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకిర్తి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఆనంగి రమణయ్య, ఆరుగుంట దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, పోతరాజు రవి,మాస శ్రీనివాసులు, గంట దేవిడ్, పెనబాక దిలీప్ రెడ్డి, ఎంసీ సుబ్రహ్మణ్యం, నాటకరాణి నవీన్, చంటి, పోలిపోగు నారాయణ, కండిగనూరు నాదముని, కోటయ్య, సతీష్, మధు, శ్రీనివాసులురెడ్డి,బత్తుల హరి,పి.రమణయ్య, తిరుమలపూడి రాజా,దారా దయాకర్ , కిషోర్, కట్ట పోలయ్య, రౌండ్లరత్నం,చేజర్ల కవిత,పెరుమాళ్ల పద్మజా యాదవ్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయ ముఖద్వార గోపురం నిర్మాణానికి శంకుస్థాపన



**నెల్లూరు రూరల్, నవంబర్ 14, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని నెల్లూరు గ్రామ దేవత ఇరుకళ్లల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం లో ముఖద్వారా గోపురం నిర్మాణ పనులకు నేడు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి కోసం 20 లక్షల రూపాయలు నిధులు అందించిన దాత ముళ్ళ చిన్నబాబుకి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిదర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, దాతల సహకారంతో త్వరలోనే ఆలయాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లి పనులు చేపడతామని అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న దేవస్థాన చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్, ఈవో, ట్రస్టు బోర్డు సభ్యులను ఆయన అభినం దించారు. నగర మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ , కార్పొరేటర్ కువ్వా కొల్లు విజయలక్ష్మీ, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, దేవస్థాన చైర్మన్ఒట్టూరు సురేంద్ర యాదవ్, కమిటీ సభ్యులు కోటరెడ్డి, గుద్దేటి చెంచయ్య, కుమార్ హరి కుమార్, అల్లం లక్ష్మీ,మిడతల లక్ష్మీ, ప్రసన్నలక్ష్మీ, కుమార్, వెంకటరత్నం నాయుడు, టీడీపీ నాయకులు కువ్వా కొల్లు బాబ్జి, పూల సుబ్రహ్మణ్యం, కమలాకర్, సుత్తారం సురేష్, మంద పెద్దబాబు, అద్దంకి కృష్ణ, కేపీఎన్ ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వోదయ బాలుర పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు



**కావలి, నవంబర్ 14, ప్రభాతవార్త:** భారతరత్న, భారతదేశపు ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు కావలి డాక్టర్ లక్ష్మీ కృష్ణారావు విశ్వదయ బాలుర ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్. డి.చౌదరి నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు నేటిబాలలే రేపటి పౌరులని,దేశ ఉజ్వల భవిష్యత్తు భావితరం పై ఆధారపడి ఉందని తెలియజేశారు.యువత దేశానికి సంపదని,ఆ సంపదతో దేశం అభివృద్ధి జరగాలని తెలియజేశారు.పాఠశాల గణిత ఉపాధ్యాయులు సి.హెచ్. బ్రహ్మయ్య మాట్లాదారు శ్రీ శ్రీ కవిత్వంలో మెరుపు మెరిస్తే వాన కురిస్తే ఆకాశంలో హరివిల్లు విరిస్తే అది మాకే మాకే అంటూ కేరింతలు కొట్టే పసికూనలు మీరు అని తెలియజేశారు. ఈ పసికూనలు పసితనములోనే పసిడి సంపాదించుకోవచ్చని, దివ్య శక్తులు ఆపాదించుకోవచ్చని తెలియజేశారు. తిరిగిరాని బాల్యంలోనే ఉపాధ్యాయుడి తోడ్పాటుతో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి నాంధీ పలకాలనీ హితవుపలికారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ఖాదర్ షరీఫ్ మాట్లాడారు ఐకమత్యంతో విద్యార్థులు మెలగాలని సోదర భావం కలిగి ఉండాలని తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిబ్బంది సమయపాలన పాటించండి: ఎంపీడీవో



**వలేటివారిపాలెం నవంబరు 14 ప్రభాతవార్త** సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని స్దానిక ఎంపీడీవో వై శంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో.పంచాయతీ సక్రటరీలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు తదితర సిబ్బందితో సమావేశమైనారు.మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యచర్యలు చేపట్టాలన్నారు. అంటు వ్యాధులు ప్రభలకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్, పాగిం గ్,శానిటేషన్ తదితర చర్యలు చేపట్టాలన్నారు.నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా విది నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఈవోఆర్డీ నారాయ ణరావుతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా చాచా నెహ్రూ జయంతి వేడుకలు



**కొడవలూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉ న్న గ్రంథాలయంలో బాలల దినోత్సవం, చాచా నెహ్రూ జయంతి వేడుకలు లైబ్రేరియన్ కె. రాజేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు.58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్ర మంలో మండల విద్యాశాఖ అధికారిని వసంతకుమారి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు నెహ్రూ,అంబేద్కర్ లా జీవిత చరిత్ర గురించి వివరించారు. ఆయన మొట్టమొదటి ప్రధాని అని తెలిపారు. గ్రంథాలయంనకు వచ్చే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అంతకముందు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు ,సచివాలయ కార్యదర్శి మురళి మరియు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎవరో చేస్తారని ఎదురుచూడకుండ రైతాంగమే తలోచేయివేశారు



**జలదంకి, నవంబర్14, ప్రభాతవార్త:** వ్యవసాయ సీజన్ రానేవచ్చింది ఇక అలస్యంచేస్తే అదునుదాటుతుంది అధికారులను అడిగితే చేతులుతిరగేస్తున్నారు.తమ పొలాలలో సేద్యపుపనులు చేసుకోవాలంటే బాట పొడవున అడ్డంకులు చేసేదిలేక కర్షకులే తలోచేయివేసి పనులు చేయించి అడ్డుతొలగించుకున్నారు.వివరాలలోకి వెళితే జలదంకి చేవూరివారితోట పైబాగాన వున్న రైతులు బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ జీబ్‌ట్రాక్‌పై నుంచి పోయి పనులు చేసుకుంటారు.అయితే ఇటీవల మేజర్ కాలువ పూడికతీత పనులు చేశారు.అయితే ఆసందర్బంలో కంపచెట్లు తొలగించి కట్టమీదనే వేశారు.కనీసం ఒక వైపున వేసిన ఎలాంటి తంటాలు వుండేవి కావు .నారుమడులు వంటివి పోసుకునేందుకు వారికి వేరేదారిలేకుండ పోయింది.పనులు చేయించిన నేతను అడి గితే మాకుకేటాయించిన పని వరకు చేయించాము మిగతావి అంటే మాపరిదిలోనిదికాదు అంటు చేతు లెత్తేశారు.ఇక చేసేదిలేక అప్రాంత రైతులు చందాలువేసుకొని జెసిబితో కట్టచదును చేయించా రు.ఈసందర్బంగ కొందరు రైతులు వారిని కదిలించి ఏంటి ఎందుకు అని వాకబుచేయగ మాకష్టాలు ఎవరికి పట్టేను ఎందుకునే మేమే మార్గం ఏర్పాటుచేసుకున్నామని దిగాలుతో చెప్పుకొచ్చారు.ఇలాంటి కడగండ్లు మండలంలో మరెన్నోనని పలువురు పెదవివిరుస్తుండడం గమనార్హం.అయా అదికారులు దృష్టిసారిస్తే ఎంతోమేలు చేకూర్చినట్టవుతుందని అంటున్నారు.

